www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023
4
తిరుపతి

సస్పెన్షన్లను నిరసిస్తూ ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

రాష్ట్ర విద్యా శాఖలో అత్యున్నత అధికారి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరిస్తూ చేస్తున్న సస్పెన్షన్లకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు బుధవారం సాయంత్రం తిరుపతి నగరంలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్ పదవతరగతి మూల్యాంకనం కేంద్రం గేటు వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి సభ్యులు హృదయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో అభద్రతా భావాన్ని కలిగేలా చేస్తున్న ఉన్నతాధికారుల వైఖరిని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, అధికారుల సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఉపాధ్యాయులను కించపరిచేలా వ్యవహరించడం మానుకోవాలని, బోధనేతర పనులు అన్నింటిని తొలగించి బోధన స్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యువశ్రీ మురళి, నిర్మల, పద్మజ, వెంకటముని, మురళీ కష్ణ, విశ్వనాథ్, కిరణ్, బండి మధుసూదన్ రెడ్డి, దండు రామచంద్రయ్య పాల్గొన్నారు.

బతుకే...'భారం'..!

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

బతుకంతా భారమే.. మూట మోస్తేనే వారి కుటుంబాలు గడిచేది.. ఒక్కో పార్సిల్‌కు రూపాయో, రెండో రూపాయలో ఇస్తారు.. బరువును బట్టి అత్యధికంగా రూ.13 తీసుకుంటారు.. దశాబ్దాలుగా పనిచేస్తున్న వీరికి ఇఎస్ఐ, ఇపిఎఫ్ అంటే ఏంటో తెలియదు.. పనిచేస్తేనే పూట గడిచేది.. సెలవులనేవి వీరికి తెలియదు.. మూడు షిఫ్ట్‌ల్లో 20 మంది చొప్పున తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో అరవై మంది హమాలీలు పనిచేస్తున్నారు. 12 గంటలు పనిచేసే వీరికి కార్మిక చట్టాలనేవి వర్తించవు. ప్రభుత్వంలో విలీనం అయినా వీరిని పట్టించుకునే నాథుడు లేకపోవడం గమనార్హం.

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రానికి అత్యాధికంగా యాత్రికులకు రవాణా సౌకర్యం కల్పించేది ఆర్టిసినే. ప్రతి రోజూ 40 వేల మందికిపైగా తిరుపతి సెంట్రల్ బస్టాండుకు యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి తోడు తిరుపతి విద్యాకేంద్రంగా, చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపారకేంద్రంగా ఎదుగుతోంది. దీంతో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా రోజుకు 90 వేల మందికిపైగా ఆర్టిసి బస్సులను ఆశ్రయిస్తుంటారు. ఏపిఎస్ఆర్టిసి ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థగా రూపాంతరం చెందింది. బస్టాండ్లోకి అడుగు పెట్టిన వెంటనే ప్రయాణికులకు కనిపించేది హమాలీలే. ఇతర ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే లగేజీని, తిరుపతి నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే వస్తువులను బస్సులపైకి చేర్చుతూ, లోడింగ్, అన్‌లోడింగ్‌లో బిజి బిజిగా ఉంటారు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వీరివి. తాతముత్తాల కాలం నుంచి ఆర్టిసి ఇచ్చిన లైసెన్సును, అక్కడికి వచ్చే ప్రయాణీకుల లగేజి మోయడం ద్వారా వచ్చే కూలీతోనే జీవనం సాగిస్తున్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండులో బ్యాచ్‌కు 20 మంది చొప్పున మూడు బ్యాచ్‌ల్లో 60 మంది హమాలీలు పని చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక బ్యాచ్, రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు మరో బ్యాచ్. ఒక బ్యాచ్ పని ముగిసిన తర్వాత మరో బ్యాచ్ ఇలా మూడు షిఫ్టుల పని చేస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పార్సిల్స్ ఒక్కో దానికి రూపాయి, రెండు రూపాయలు చొప్పున హమాలీలకు చెల్లిస్తుంటుంది ఆర్టిసి కార్గో. వారు మోసే బరువు, లగేజి వచ్చిన దూరాన్ని బట్టి ఒక్కొ దానికి రూపాయి, రెండు రూపాయలు చొప్పన, లోడింగ్, అన్‌లోడింగ్‌కు అత్యధికంగా ఒక పార్శిల్‌కు 13 రూపాయల ప్రకారం చెల్లిస్తుంటారు. నిత్యం బస్సులు వదిలే కాలుష్యం పీల్చుతూ, బస్సుల మధ్యలోనే పని చేసే వీరికి నిత్యం ఆరోగ్య సమస్యలే. కానీ వీరికి ఈఎస్ఐ కార్డుల్లేవు. అసలు ఈపిఎఫ్ అంటే ఏమిటో తెలియకపోవడం గమనార్హం.

కూలి దొరికితేనే కూడు

సుబ్రమణ్యం, ఆర్‌టిసి హమాలీ, దిగువ మల్లవరం

నేను 20 సంవత్సరాలుగా ఆర్‌టిసి హమాలీగా పని చేస్తున్నాను. కూలీ దొరికితేనే పిల్లపాపలకు అంత కూడు పెట్టగలం. ఒకరికి కూలీ ఉంటే మరొకరికి ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఇక్కడ పని చేసే మేమంతా ప్రతి ఒక్కరికీ కూలీ వచ్చేలా మాట్లాడుకుని, ఒకరి తర్వాత ఒకరు పనులు చేసుకుంటూ ప్రతి ఒక్కరికి తలా రూపాయి వచ్చేలా పనులు చేస్తున్నాం. రోజుకు 500 నుంచి 700 రూపాయల వరకు కూలీ గిట్టుబాటు అవుతుంది. దాంతోనే కాపారాలు లాక్కొస్తున్నాం.

పిల్లల భవిష్యత్ కోసం అగచాట్లు

మురళి, హమాలీ, దిగువ మల్లవరం

మా తాత ముత్తాల కాలం నుంచి ఆర్‌టిసి కూలీగానే పని చేస్తున్నాం. మా తాతకు, మానాన్నకు చదువు లేదు. వారికి వచ్చే కూలీలతో కుటుంబాన్ని పోషించడమే గగనం కావడంతో మాకు చదువు లేదు. మా పిల్లల భవిష్యత్తు కూడా మాలా కాకుడదని, వచ్చిన రూపాయి రూపాయి కూడబెట్టి మా పిల్లలను చదివిస్తున్నాం. వాళ్ల భవిష్యత్తు కోసం ఎంతటి ఇబ్బంది వచ్చిన సెలవనేది పెట్టకుండా బతుకు సాగించేస్తున్నాను.

ఉండేందుకు సొంత ఇల్లు లేదు

కె.వెంకటముని, హమాలీ, చెల్లూరు

నేను ఉండేందుకు సొంత ఇల్లు లేదు. కుటుంబ సభ్యుల ద్వారా వచ్చిన వారసత్వ ఆర్‌టిసి లైసెన్స్‌ను నమ్ముకుని బతుకుతున్నాను. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇల్లు ఇవ్వలేదు. కూలి డబ్బుల్లో ఎక్కువ భాగం బాడుగలకు, కరెంట్ బిల్లులకు సరిపోతోంది. బియ్యం, ఉప్పు, పప్పు ధరలు పెరిగిపోవడంతో చాలా వరకు ఖర్చులు తగ్గించుకుని, పొదుపుగా జీవనం గడుపుతున్నాం. ఎంత పొదుపు చేసినా, అరాకొర కూలీతో బతుకు కష్టంగా ఉంది. అయినా తప్పదు.

కూలంతా ఛార్జీలకే సరిపోతోంది

మురగయ్య, హమాలీ, నగరి

నేను నగరి నుంచి రోజూ తిరుపతికి వచ్చి బస్టాండులో హమాలీగా పని చేస్తున్నాను. తాతముత్తాల నుంచి వచ్చిన లైసెన్స్ కావడంతో ఇక్కడే పని చేసుకోవాల్సిన పరిస్థితి. ఆర్‌టిసి లగేజీ మోస్తున్నా, ఆ బస్సుల్లో మాకు పాసు కూడా ఇవ్వరు. కనీసం ఈఎస్ఐ ఇస్తే మాకు, మా కుటుంబ సభ్యులకు ఆరోగ్యంపై ఒక భద్రత ఉండేది. ఈపిఎఫ్ మాకు లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ లేదు. మాకు ఈఎస్ఐ, పిఎఫ్ వంటివి అమలు చేసినా కాస్తైనా ఆదుకున్నవాళ్లవుతారు.

రాష్ట్రస్థాయిలో ఎన్ఆర్ఐ హవా

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియల్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి ఎన్ఆర్ఐ అకాడమీ విద్యార్థులు అత్యధిక ర్యాంకులతో తమ హవా కొనసాగంచారని ఆ విద్యాసంస్థల డైరెక్టరు విద్యాసాగర్ తెలిపారు. స్థానిక ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని ఆ కళాశాల క్యాంపస్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎస్.నమ్రత 470కిగాను 465 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. డి.ప్రణతి 464, కె.వైష్ణవి 463, ఎం.యోగేష్ 460, కె.నందిని, జి.చంద్రమౌళి ,సి.సుమిత్ర 450, వి.సాయిరాధిక 456, పి.యాస్మిన్ 455, కె.వేదశ్రీ 454 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఒకటి నుంచి 10వ స్థానాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. 450 మార్కులను 100కిపైగా విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ బైపిసిలో కె.భవ్యశ్రీ 440కిగాను 435 మార్కులు సాధించి రాష్ట్రప్రథమ స్థానం సాదించిందని, ఆర్.యశ్వంత్ 430 రెండోస్థానంతోపాటు 25 మంది విద్యార్థులు 425కుపైగా మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎ.వర్షిత 1000 మార్కులకుగాను 979 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు, శ్రీలిఖితా 974తో ఐదోస్థానం, వందమందికిపైగా 950 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఇంటర్మీడియల్ 2023 పరీక్షా ఫలితాల్లో ఎక్కువశాతం ఉత్తీర్ణతతో బాలికలే పైచేయి సాధించారని ఆర్ఐవో తెలిపారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 56శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8వస్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 72శాతం ఉత్తీర్ణతతో జిల్లా 5వ స్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో జిల్లా నుంచి 36,028 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే 25783 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో 17,678 మంది బాలురు పరీక్షలకు హాజరైతే 11744 మంది ఉత్తీర్ణత 66శాతం, బాలికలు 18350 మంది పరీక్షలకు హాజరైతే 77శాతంతో 14039 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో జిల్లా నుంచి 43,713 మంది పరీక్షలకు హాజరైతే 24425 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో బాలురు 22239 మంది పరీక్షలకు హాజరైతే 11204 మంది 50 శాతంతో ఉత్తీర్ణత, బాలికలు 21474 మంది పరీక్షలకు హాజరైతే 62 శాతంతో 13221 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో బాలికలు అధికశాతం ఉత్తీర్ణత సాధించి, పైచేయి సాధించారన్నారు.

'అశ్వమేధ' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

2023 ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అశ్వమేధా మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని ఆ కళాశాల డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, గోవర్ధన్, ప్రిన్సిపాళ్లు భాస్కర్‌రెడ్డి, సుమతి తెలిపారు. స్థానిక ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూనియర్ ఇంటర్‌లో సాయిప్రీతీ 432, కె.నియతి 429, తేజశ్రీ 429, రోహిత్ 426 మార్కులు, 400కుపైగా మార్కులను 20 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఎంపిసిలో సాయిస్నేహ 464, అనూష 463, టిఎస్.చాతుర్య 645, దివ్యరెడ్డి, 457, శ్రీష్మరాయన్ 455, 400కుపైగా మార్కులను 30 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో వర్షారెడ్డి 988, నీహారిక 988, ఎస్‌పి.హారిక 987, ఉమేష్ చౌదరి 983, తేజశ్రీ 982, 900కుపైగా 20 మంది విద్యార్థులు, ఎంపిసిలో అంజలిరత్న 984, విధీష 983, నాగప్రహర్ష 977, బి.హర్ష 974, 900కుపైగా మార్కులను 28 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

1-5 తేదీల్లో తిరుపతిలో ఏపీ సీఎం కప్ టోర్నమెంట్

తిరుపతి టౌన్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఏ.పి సి.ఎం కప్ టోర్నమెంట్‌ను మే 1-5 తేదీల్లో తిరుపతిలో పురుషులు, మహిళలకు 14 విభాగాలలో నిర్వహిస్తున్నామని, ఏర్పాట్లలో అలసత్వం లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఛైర్మన్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సిఎం కప్ టోర్నమెంట్ నిర్వహణపై వివిధ కమిటీలతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 13 ఉమ్మడి జిల్లాల నుంచి మొత్తం 4,999 మంది క్రీడాకారులు హాజరవుతారని, అందులో ప్రతి జిల్లా నుంచి 178 మంది మహిళలు, 179 మంది పురుషులు వెరశి మొత్తం 357 మంది ఉమ్మడి 13 జిల్లాల నుంచి హాజరవుతారని తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిపిఒ పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ పర్యవేక్షణలో బందోబస్తును క్రీడా ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, ఎస్.ఈ ఆర్డబ్ల్యూఎస్ విజయకుమార్, సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి, డీఎస్‌ఓ శేషాచలం రాజు, సిఈఓ సేట్విన్ మురళి కష్ణ రెడ్డి, పిడి డి ఆర్ డి ఏ జ్యోతి, చీఫ్ కోచ్ సయ్యద్ హుస్సేన్, సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య పాల్గొన్నారు.

రేపు వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం 28వ తేదీ ఉదయం 11 గంటలకు మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి తెలిపారు. సర్టిఫికెట్ కోర్సుల నుండి పి హెచ్ డి వరకూ కోర్సులు పూర్తి చేసుకున్న 550 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలు బహూకరిస్తామన్నారు. అలాగే ఇద్దరికి మహామహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు ప్రదానం చేస్తామని ఆయన వివరించారు. విశ్వవిద్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేద పరిరక్షణ, వేద ప్రచారం కోసం టీటీడీ 2006 లో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్థాపించిందన్నారు. టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి సహకారం, మార్గదర్శనంలో విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలా అభివద్ధి బాటలో ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, టిటిడి ఛైర్మన్, ఈవోలు స్నాతకోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

వీరికి అత్యున్నత పురస్కారాలు

తమ జీవితాన్ని వేద విద్య వ్యాప్తికి, వేద పరిరక్షణకు అంకితం చేసిన హైదరాబాద్ కు చెందిన బ్రహ్మశ్రీ వి. సుబ్రహ్మణ్య శాస్త్రి ఘనపాటి, చెన్నై కి చెందిన బ్రహ్మశ్రీ రామచంద్ర మణి ద్రావిడ శాస్త్రి కి మహామహోపాధ్యాయ అత్యున్న పురస్కారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేదంలో మంచి ప్రావీణ్యం ఉండి వేద పరిరక్షణకు కషి చేస్తున్న అన్నవరానికి చెందిన బ్రహ్మశ్రీ కపిలవాయి రామ సోమయాజి శాస్త్రి, మైసూరు కు చెందిన బ్రహ్మశ్రీ సి. వంశీకష్ణ ఘన పాటి కి వాచస్పతి పురస్కారం తో సన్మానిస్తామని ఉపకులపతి ప్రకటించారు.

శ్రీనివాస సేతు పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి : తిరుపతి టౌన్

శ్రీనివాస సేతు పనులను పూర్తి చేసి అనుకున్న సమయంలోపు ప్రారంభించాలని స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ హరిత అన్నారు. స్మార్ట్‌సిటీ నిర్వహణలో చేపట్టిన ప్రాజెక్టుల గురించి ఆప్కాన్ ప్రతినిధి స్వామితో హరిత మాట్లాడుతూ జూన్‌కల్లా శ్రీనివాస సేతు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెత్తసేకరణ సక్రమంగా చేయాలి

ఇంటింటికి వెళ్లి చెత్తసేకరణ సక్రమంగా చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. 17వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి 'మీ వద్ద చెత్త సేకరణ సక్రమంగా చేస్తున్నారా' అని అడిగి తెలుసుకున్నారు. గోపాల్‌రాజు కాలనీ, దాసరిమఠం, ఎల్లప్పరెడ్డి క్వార్టర్స్, ఎస్‌బిఐ కాలనీ, పళణి థియేటర్ రోడ్డులోని పరిసరాలను పరిశీలించారు. రాయల్‌నగర్ రోడ్డులో కాల్వలు పాడైపోయిన స్థితి చూసి మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలన్నారు. కార్పొరేటర్ తాళ్లూరి రత్నకుమారి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఇ మహేష్ పాల్గొన్నారు.

తిరుపతి కోఆప్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులుగా భక్తవత్సలం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ది తిరుపతి కో ఆప్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ పాలక వర్గం ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. జిల్లా అధ్యక్షులుగా భక్తవత్సలం, ఉపాధ్యక్షులుగా రామ్మూర్తి రెడ్డి, కార్యదర్శిగా రామగోపి, డైరెక్టర్లుగా టి.గరటయ్య, ఎం.బాబు, జె.ఈశ్వరయ్య, ఎం.వేదాచలం ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు వెంకటమ్మ ఎన్నికల అధికారిగా, అరుణకుమారి పర్సన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షులు భక్తవత్సలం మాట్లాడుతూ 1926లో స్థాపించిన ఈ సొసైటీ ఎంతోమంది పేద, మధ్యతరగతి వర్గాలకు రుణాలను అందించిందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటికల సాకారం చేయడానికి కృషి చేస్తామన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెడతామన్నారు.

29న కారుణ్య నియామకాల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఏపిఎస్ఆర్‌టిసి ఉమ్మడి చిత్తూరు జిలాల్లో కారుణ్య నియామకాల కోసం ఈ నెల 29న సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 01.01.2016 నుంచి 31.12.2019 మధ్య చనిపోయిన ఆర్‌టిసి ఉద్యోగుల వారుసులకు కారుణ్య నియామకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి డిపిటివో కార్యాలయం వద్ద 29వ తేది 9.30 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు.

భక్తుల ఇబ్బందికి టిటిడినే కారణం : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'శ్రీవారి' చెంత కష్టం చేస్తున్న కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం వివక్ష చూపుతోందని, భక్తులకు ఇబ్బంది కలిగితే అందుకు తిరుమల తిరుపతి దేవస్థానమే బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అన్నారు. తిరుపతి యశోదానగర్‌లోని సిఐటియు కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ సులభ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కడానికి యాజమాన్య ధోరణే ప్రధాన కారణమని విమర్శించారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల కష్టనష్టాలను టిటిడి యాజమాన్యం ఏనాడూ పట్టించుకోకపోవడం వల్లనే, నేడు కొండపై భక్తులకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. సులభ్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు కావటం లేదని, కాంట్రాక్టరుకు ఇస్తున్న మొత్తం కార్మికులకు చేరటం లేదని అన్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తుల మల మూత్రాలను శుద్ధిచేసి తిరుమలను పర్యావరణ హితంగా మారుస్తున్న సులభ్ కార్మికులు లడ్డూ, వడకు, బ్రహ్మోత్సవ బహుమానానికి నోచుకోలేదన్నారు. తిరుమల కొండపై ఎఫ్ఎంఎస్, సులభ్ కార్మికులే లేకపోతే ఎంత తీవ్రమైన ఇబ్బందులు వస్తాయో తెలిసినా టిటిడి యాజమాన్యం వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కార్మికుల సమస్యలంటేనే టిటిడికి పట్టడం లేదని, 900 రోజులుగా అటవీ కార్మికులు పోరాటం సాగిస్తున్నా పట్టీపట్టనట్లు అధికారులు తయారయ్యారన్నారు. కార్మికులను విభజించి పాలించేలా యాజమాన్యం తీరు ఉందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు టి.సుబ్రమణ్యం, మునిరాజ, వేణుగోపాల్, రఘు, బుజ్జి, పార్థసారథి, రామకృష్ణ, బాబూరావు పాల్గొన్నారు.

సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు జనసేన అన్నదానం

నాలుగో రోజు తిరుమల తిరుపతి దేవస్థానం సులభ్ కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతు ప్రకటించడమే కాకుండా జనసేన జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న సులభ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, బాటసారి పాల్గొన్నారు.

తల్లుల ఖాతాలో రూ.38.29 కోట్ల జగనన్న వసతి దీవెన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలకు 2022-23 విద్యా సంవత్సరానికి బుధవారం జగనన్న వసతి దీవెన మొదటి విడత కింద రూ.38.29 కోట్ల నగదు జమ చేసినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం అనంతపురం జిల్లా నార్పల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన సుమారు 9.55 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ.912.71 కోట్ల నగదు మొత్తాన్ని వసతి దీవెన కింద కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసార వీక్షణ ఏర్పాటుతో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి ఏటా రెండు దఫాలలో ఐ.టి.ఐ. విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరిగ్, మెడిసన్ తదితర కోర్సులను అభ్యసించే వారికి 20 వేలు చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తూ వారి చదువులకు ఆసరాగా నిలుస్తున్నారని, అందులో భాగంగా నేడు 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా జిల్లాలోని అర్హులైన 39,960 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ. రూ.38.29 కోట్ల లబ్ధి జరిగిందని అన్నారు.



సెంథిల్ కుమార్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి స్విమ్స్ యూనివర్శిటీలో కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం పరిశోధక విద్యార్థి కె.సెంథిల్ కుమార్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పిహెచ్‌డి) ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ అబాచంద్ర పర్యవేక్షణలో 'ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ ఎర్లీ మొబిలైజేషన్ అండ్ స్ట్రక్చర్డ్ కార్డియక్ రీహాబిలిటేషన్ ఆఫ్ పంక్షనల్ అవుట్ కమ్‌అండ్ క్వాలిటి ఆఫ్ లైఫ్ ఇన్‌పోస్టు కరోనరీ అర్టరీ బైపాస్‌గ్రాఫ్ట్ ఎ ర్యాండోమైజ్డ్ కాంట్రోల్డ్ స్టడీ' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించినందుకు పిహెచ్‌డి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ విసి డాక్టరు వెంగమ్మ అభినందించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'తెలుగు' అమలు చేయాలి

తిరుపతి టౌన్ : అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషను వందశాతం అమలు చేయాలని తెలుగు భాష సంఘ అధ్యక్షులు పి. విజయబాబు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో డిఆర్‌ఓ శ్రీనివాసరావు అధ్యక్షతన పాలనా భాష తెలుగు భాష అమలుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు భాష సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ... ప్రతి కార్యాలయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని తెలిపారు. మౌఖిక భాషనే పాలనా భాషగా ఉపయోగించాలని తెలిపారు. ఫైళ్లు, వ్యక్తిగత రిజిస్టర్లు, లేఖలు, ప్రమోషన్లు, బదిలీలు, హాజరు పట్టిక, నోటీస్ బోర్డులు వివిధ శాఖల పేర్లు వంటి కార్యకలాపాలు అన్ని తెలుగు తెలుగు భాష లోనే ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భవిష్యత్తు తరాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి పేద విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రతి పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధన జరిగేలా కషి చేస్తున్నారని తెలిపారు. తెలుగు భాష సంఘ సభ్యులు మస్తానమ్మ, తళ్వా వెంకటయ్య పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై కమిటీకి సంబంధం లేదు

చంద్రగిరి : ప్రాచీన తిమ్మప్ప దేవాలయ పునర్నిర్మాణంపై సంబంధం లేని వ్యక్తులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఈ వసూళ్లకు ఆలయ పునరుద్ధరణ కమిటీకి ఎలాంటి సంబంధం లేదని ఆ కమిటీ అధ్యక్షుడు మునిగంగి రెడ్డి అన్నారు. చంద్రగిరి పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం 2018లో ఆలయం ఉన్న స్థలం యాజమాని జ్యోతి తమ కమిటీకి 20 సెంట్లు భూమి దానం ఇచ్చారని, టీటీడీ ద్వారా ఈ ఆలయ నిర్మాణం చేస్తామని ఆయన వెల్లడించారు. టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి ఆలయ పునర్మానానికి స్థలాన్ని పరిశీలించి 50 లక్షలు మంజూరు చేయుటకు అంగీకరించారని తెలిపారు. కానీ తొండవాడకి చెందిన తపస్వి మురళి రెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ వసూళ్లకు తమ కమిటీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మురళిరెడ్డిపై చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పునరుద్దరణ కమిటీ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, సభ్యులు చంద్రబాబు, నరేష్, తిలక్ యాదవ్, రామ్మూర్తి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అందరినీ ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలో అందరిని ఆరోగ్యవంతులుగా చేయడమే నా లక్ష్యమని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలం లో అన్ని పంచాయతీలలో 90 రోజుల వరకు జరిగే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని దామల చెరువు పంచాయతీ బందార్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా మెడికల్ క్యాంపుతో ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. 43 రకాల రక్త పరీక్షలు, గుండె పరీక్షలు చేయబడుతుందని చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 5 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు చేసే బహత్తర కార్యక్రమం పాకాల మండలంలో ప్రారంభం కావడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రివియా హెల్త్ సంస్థ వారి సహకారంతో గ్రామ గ్రామాన జరుగుతున్న రక్త పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, 250 మంది సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పల్లెల్లో విజయవంతంగా ఈ మెడికల్ క్యాంపు కొనసాగుతుందని అన్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా 5 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయించడం చెవిరెడ్డి మాత్రమే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, తుడా కార్యదర్శి లక్ష్మీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, డీఎంహెచ్ఓ శ్రీహరి, జడ్పీటీసీ నంగా పద్మజా రెడ్డి, ఎంపీపీ లోకనాథం, మండల అధికారులు పాల్గొన్నారు.

వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-ఓజిలి: అకారణంగా తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో రెండవ రోజు బుధవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. కార్మికులపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్న మండల విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 23 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథక కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మను రాజకీయ ఒత్తిళ్లతో అకారణంగా తొలగించారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి నెలనెలా బిల్లులు రాకపోయినా నిత్యావసర సరుకులను అప్పులు చేసి పిల్లలకు కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం సరికాదని తెలియజేశారు. మండలంలో ఎంఈఓ నియంతృత్వ వ్యవహరిస్తున్నారని ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేసుకోవడానికి టెంట్ వేసుకోనీయకుండా పోలీసులకు చెప్పి అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కోట: చిట్టేడు గ్రామ పంచాయతీ వజ్జావారిపాలెం గ్రామంలో తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి ఎంపీ ల్యాండ్స్ నిధులతో నూతనంగా నిర్మించిన తాగునీటి యంత్ర యూనిట్‌ను బుధవారం గూడూరు శాసనసభ్యులు వెలగపల్లి.వరప్రసాద్ రావు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న తమకు వైసీపీ ప్రభుత్వం ఎంపీ సహాయంతో పరిష్కారం కావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో గూడూరు శాసనసభ్యులు వెలగపల్లిపల్లి వరప్రసాద్ రావు, నెల్లూరు డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, వాకాడు మండల వైసీపీ నాయకులు కోటేశ్వర్ రెడ్డి, కేశవరం సర్పంచ్ శ్రీరామ్ కష్ణ స్వాతి, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

'మైనార్టీల ద్రోహి చంద్రబాబు'

ప్రజాశక్తి-గూడూరు టౌన్: మైనారిటీల ద్రోహి చంద్రబాబు అని వైసీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్ అన్నారు. బుధవారం పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న తన నివాసంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు నిన్న పెద్దకూరపాడు బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీని పొగడ్తలతో ముంచెత్తారు. నరేంద్రమోడీ విజన్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నానని అన్నారు. దీంతో మరోసారి ప్రజల, మీడియా సాక్షిగా తన అసలు రంగును బయటపెట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు క్షమించరని ఇప్పటికైనా టీడీపీలో ఉన్న ముస్లిం సోదరులు ఆ పార్టీ నుంచి బయటకు రావాలని కోరారు.

'అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తాం'

ప్రజాశక్తి-క్యాంపస్: అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల కోఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళి లు బుధవారం అన్నారు. వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణలో భాగంగా జిల్లా అధ్యక్షుడు బి.ఓబుల్ రెడ్డి అధ్యక్షతన యూనివర్సిటీలో లెక్కల రాజశేఖర్ రెడ్డి, మురళి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ స్కూల్స్‌లలో విద్యార్థుల చదువుకి తల్లిదండ్రుల దగ్గర నర్సరీ నుండి పదవ తరగతి వరకు రూ.లక్షలు వసూలు చేస్తున్నారని, అందులో భాగంగా తిరుపతిలోని కొన్ని స్కూల్స్‌లలో తరగతికి రూ.2 నుంచి 3 లక్షల వరకు ముక్కు పిండి వసూలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వంశీ రెడ్డి, జోగేంద్ర, ప్రశాంత్, ప్రదీప్, సెందిల్ కుమార్, కేదర్, భార్గవ్, ప్రసన్నకుమార్, నరసింహ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసిబి అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక ఎంఆర్ పల్లి పోలీసు స్టేషన్ సమీపంలోని అవిలాల పంచాయతీ, ఆర్‌సి రోడ్డులో ఉన్న తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నట్లు తిరుపతి ఏసిబి అధికారులకు రహస్య సమాచారం అందింది. దీంతో ఏసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలో ఒక సిఐ, ఇద్దరు ఎస్ఐలు, 10 మంది కానిస్టేబుళ్లతో కూడిన బృందం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయంలో నగదు ఉండడాన్ని గుర్తించారు. ఆ నగదు, దానికి సంబంధించిన ఫైళ్లను క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల తరహాలో 'గంగజాతర'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బహ్మోత్సవాల తరహాలో అత్యంత వేడుకగా గంగజాతర నిర్వహించనున్నామని ఎంఎల్ఏ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. గంగజాతరలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గంగమ్మ జాతరకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ రాష్ట్ర పండుగగాప్రకటించడం సంతోషకరమని అన్నారు. బుధవారం స్థానికులకు అమ్మవారి కుంకుమబొట్టు ప్యాకెట్లను ఇస్తూ జాతర ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు లక్షల ఆహ్వాన పత్రికలను తిరుపతి వాసులకు అందిస్తున్నామని తెలిపారు. ఆలయం వద్ద నిర్వహించిన పులివేషగాళ్లు, కర్రసాము విన్యాసాలను తిలకించి వారిని అభినందించారు. కర్రసాము విన్యాసంలో వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆలయ కమిటీ ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునికృష్ణ పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం టిడిపితోనే సాధ్యం: జగన్నాథం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం రావాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని బీసీ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్నాథం అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల అభివద్ధి కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని, బీసీ ప్రజలకు ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో బీసీ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ ద్వారా నిధులు సైతం కేటాయించి పునాదులు కూడా వేశామన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులకు తెగబడుతున్నారని, తిరిగి ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలలో బీసీ భవనాలను నిర్మించాలన్నారు. 56 బీసీ కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి నిధులు, కనీసం కుర్చీలు కూడా లేని దుస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందన్నారు.

ఐడిఎస్ కంపెనీతో మహిళా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్, ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎంవోయూ చేసుకున్నారు. ఇరు సంస్థల ప్రతినిధులు సునీల్ సుబ్రమణ్యం బిజినెస్ హెడ్ ఐడిఎస్ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని, ఆచార్య జె.కాత్యాయని, ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె రాజా రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాల పైన సంతకం చేశారు. ఈ ఎం ఓ యు యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే రెండు సంస్థల మధ్య ఉన్నటువంటి సదుపాయాలని విద్యార్థుల కొరకు వినియోగించుకోవచ్చుని, మరియు విద్యార్థులలో స్కిల్ డెవలప్మెంట్‌ను భారత్ బ్లాక్ చైన్ నెట్వర్క్ ద్వారా పెంచడానికి ఉపయోగకరముగా ఉంటాయని అన్నారు. ఈ ఎంఓయూ రెండు సంస్థల యొక్క రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ రాజా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య అనురాధ, ఆచార్య ఆర్ ఉష, ప్లేస్మెంట్ ఆఫీసర్, పిఆర్ఓ శ్రీరజనీ, వి.భార్గవి రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు పట్టాలు ఇప్పించండి: మాజీ సర్పంచ్

ప్రజాశక్తి-ఓజిలి: భూ పంపిణీలో నిరుపేదలకు పట్టాలిచ్చి వారి జీవనోపాధికి తోడ్పాటు అందించాలని భువనగిరిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ సురేష్ బుధవారం తహశీల్దార్ డి.లాజరస్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ మండలంలోని భువనగిరిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్లు 67/3, 67/4 లలో 8 ఎకరాల ప్రభుత్వ అనాధీన భూములు ఉన్నాయని, త్వరలో జరగబోయే భూ పంపిణీలో భూములు లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన భూములు లేని 17 మంది నిరుపేదలకు ప్రభుత్వ అనాధీన భూములకు పట్టాలు ఇప్పించి ఆదుకోవాలని తహశీల్దార్‌ను అభ్యర్థించారు. తహశీల్దార్ స్పందిస్తూ గ్రామంలో సమగ్ర విచారణ జరిపి భూములు లేని నిరుపేదలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శ్రీ స్వర్ణాంధ్ర భారతి స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక

ప్రజాశక్తి-గూడూరు: స్థానిక రెండో పట్టణ పరిధిలోని 'శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్' లో బుధవారం ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపెయిడ్ సివి రామన్ టాలెంట్ టెస్ట్' నేషనల్ లెవెల్‌లో ఎగ్జామ్ జరిపారు. ఈ ఎగ్జామ్‌లో 26 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో పి.లక్ష్మి తేజ సాయి రాష్ట్రస్థాయి 2వ స్థానానికి ఎంపికైనట్లు, నలుగురు విద్యార్థులు బి.లక్ష్మీ దీపిక, వై.పూర్ణిమ సాయి, పి.సిరి లక్ష్మి, పి.సంజన గోల్డ్ మెడల్ సర్టిఫికెట్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ నవకోటి నాయుడు తెలిపారు. అదేవిధంగా సివి రామన్ టాలెంట్ టెస్ట్‌లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ముగ్గురు విద్యార్థులు క్వాలిఫై సర్టిఫికెట్స్ సొంతం చేసుకున్నట్లు కరస్పాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ సిడి సునీల్, అకడమిక్ కోఆర్డినేటర్ కె హరికష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ ఎన్ సాయి సింధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని అన్నాస్వామి పల్లె గ్రామంలో బుధవారం శ్రీ రామ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా విభాగం ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా విభాగం వాలంటీర్స్ అన్నాస్వామి పల్లె గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్ళి మొక్కలు అందించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ న్యాయవాది, గ్రామ పెద్ద మునిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో వివిధ కార్యక్రమాలు చేస్తున్న కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ కె.జయచంద్ర, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.చక్రిశ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-రేణిగుంట: గ్రామపంచాయతీ సర్పంచ్ నగేషం కరుణామయుడని వైసీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. బుధవారం సర్పంచ్ నగేషం జన్మదిన సందర్భంగా సర్పంచ్‌పై పూల వర్షం కురిపించి శాలువాతో సన్మానించి ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా ప్రజలకు రాత్రింబవళ్ళు సేవలందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయి చరిత్ర సష్టిస్తున్నాడని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ తిరుపతి జిల్లా నాయకులు, పంచాయతీ సెక్రెటరీ విజయభాస్కర్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సర్పంచ్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు తులసి రాజన్, పంచాయతీ కార్మికుడు సుబ్బరాజు, వార్డ్ మెంబర్ ఇన్బానాథన్, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పుర ప్రముఖులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సర్పంచ్ నగేషంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ నాయకులు వైసీపీలో చేరిక



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో గోపాల్, బాల, రాజు, రవి, అరుణ్ కుమార్, బాబు, మస్తాన్, రఫీ, నాగరాజు, వెంకటేష్, షబ్బీర్, శీను, టీ నాగరాజు, మనోజ్, వినోద్ ముఖ్యులుగా ఉన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారికి కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలను చూసి, శ్రీకాళహస్తిలో చేస్తున్న అభివద్ధికి ఆకర్షితులై యువత వైసీపీలో చేరుతుందన్నారు.

సంగీత గేయ ధార 405వ కార్యక్రమం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వి బి సాయి కష్ణ యాచేంద్ర అద్వితీయ సంగీత గేయ ధార 405వ కార్యక్రమం బుధవారం ఉదయం ఏడీకే కళ్యాణ మండపం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ గేయ రచయిత భువన చంద్ర, కవి, కథకులు, విమర్శకులు డా. కానల నాగభూషణం, ప్రాశ్నికులు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఆముదాల మురళి, శోభా రాజు, పాలూరి బ్రహ్మానందం రెడ్డి, రవిలు విచ్చేశారు. తొలుత అవధాని సాయి కష్ణ యాచేంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు భాస్కర్ రాజు, కార్యదర్శి కుప్పయ్య, జిల్లా సహాధ్యక్షులు యుగంధర్ రాజు, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత అశోక్ రాజు బాల సుబ్రమణ్యం, రామచంద్ర రాజు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాప్రయోజనాల కోసమే అభివృద్ధి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) : టిడిపి హయాంలో ఆ పార్టీ నేతలు స్వప్రయోజనాల కోసం పాలన సాగించారని, వైసిపి హయాంలో తిరుపతిలో భారీ మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు, తాతయ్యగుంట గంగమ్మ జాతరకు ప్రభుత్వ గుర్తింపు తీసుకురావడం ప్రజాప్రయోజనాల కోసమేనని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ముద్రనారాయణ మాట్లాడుతూ భూమన కుటుంబం తిరుపతి అభివృద్ధి కోసం అమర్నిశలు కృషి చేస్తుంటే బురద చల్లడం మంచిది కాదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో నేతలు ఎస్కె బాబు, పసుపులేటి సురేష్, బాలిశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

జులై 23 నుంచి హనుమ అవార్డ్స్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) : రోజురోజుకూ కళలు అంతరించిపోతున్నాయని, కళాకారులు మరుగున పడిపోతున్న తరుణంలో జులై 23 నుంచి హనుమ అవార్డ్స్ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు అభినయ ఆర్ట్స్ అధినేత బిఎన్ రెడ్డి వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా నిర్వహించడంలో నెల మారినా, ఏడాది మారకుండా ప్రతి ఏడాదీ నాటకోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సందేశాత్మక సాంఘిక నాటికలు, పౌరాణిక పద్యనాటకాలు, భరతనాట్యం, కూచిపూడి, జానపద బృందం, సోలో పోటీలు జరుపుతున్నట్లు తెలిపారు. మే 18 నుంచి ప్రాథమిక పరిశీలన చేసి ఉన్నతమైన ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తామన్నారు. అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, సభ్యులు ఇరమని శేఖర్, మిమిక్రీ ఆర్టిస్ట్ విజయకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సీఎం సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో పథకాలన్నీ టీడీపీ కార్యకర్తలకే పంచి పెట్టారని గుర్తు చేశారు. సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయ కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, చిల్లకూరు జడ్పీటీసీ మన్నెం శ్రీనివాసులు, నరసయ్య, అజీజ్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాస్ సేవలు ఆదర్శవంతం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్రీయ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌజన్యంతో బుధవారం పుత్తూరు గుడ్ షెఫర్డ్ హాస్పిటల్‌లో రాస్, టాటా ట్రస్ట్, శ్రీకార్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి బీపీ, షుగర్, హెపటైటిస్, గొంతు, నోరు, గర్భసంచి వంటి ఏడు రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేన్రీ భాస్కర్ మాట్లాడుతూ రాస్ సేవలు అందరికీ ఆదర్శంగా ఉన్నాయన్నారు. టాటా ట్రస్ట్ హాస్పిటల్ అధినేత హేమంత్ మాట్లాడుతూ రాస్‌తో గత సంవత్సరం నుంచి చుట్టుపక్కల మండలాల్లో రూ.3 వేల విలువైన స్కానింగ్ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాస్ అధికారి రవి, కనకవల్లి, మీనా, డాక్టర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ సెక్యూరిటీ నిజాయితీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది తన నిజాయితీని చాటుకున్నారు. బుధవారం బెంగళూరుకు చెందిన పరమేశ్వరరావు కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. దర్శనం అనంతరం స్తుపథ మండపం వద్ద ఉన్న అన్నదాన మండపం వెళ్తుండగా తన సెల్ ఫోను పోగొట్టుకున్నాడు. దీనిని సూపర్‌వైజర్ భాస్కర్ గమనించి సెల్ ఫోన్ పోగొట్టుకున్న పరమేశ్వరరావుకు అప్పగించారు. కార్యక్రమంలో సిద్ధారెడ్డి, హెూంగార్డ్ సూపర్వైజర్ శ్రీహరి రావు పాల్గొన్నారు. అనంతరం భక్తుడు పరమేశ్వరరావు సెక్యూరిటీ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

శ్మశానంలో ముళ్ల చెట్ల తొలగింపు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: స్థానిక రెండో పట్టణ పరిధిలోని అడవి కాలనీ సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ముళ్ల చెట్లు పెరిగి పోయి, కర్మ కతువులకు ఇబ్బందిగా ఉండడంతో పట్టణవాసి గోపాల్ యాదవ్, అతని మిత్రుల ఆధ్వర్యంలో బుధవారం ముళ్లచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా శ్మశాన వాటికను శుభ్రం చేయిస్తున్నామని, దీని అభివద్ధికి పట్టణంలోని దాతలు తమ వంతు సహాయం అందించాలని కోరారు.

ప్రచారార్భాటాలే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో అభివద్ధి శూన్యమనీ, వైసీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లు ప్రచారార్భాటాలతోనే సరిపెట్టేశారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోటా వినుత విమర్శించారు. బుధవారం ఆమె నేనూ – నా నియోజకవర్గ ప్రజలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కడికెళ్లినా అభివద్ధి శూన్యమనీ, అయితే స్థానిక ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు.

నేరాలు-ఘోరాలు

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తిరుచానూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్న కాలువ సమీపంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు యోగిమల్లవరంకు చెందిన అమర్నాథ్(37) స్థానికంగా ప్రైవేట్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో అతని భార్య ఇటీవల ఓ ఆలయానికి తీసుకెళ్ళి మద్యం సేవించకుండా చేతికి దారం కట్టించింది. దీంతో మద్యం సేవించడం మానలేక అతను తీవ్ర మనస్తాపానికి గురై పొన్నకాల్వ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో పశువులకాపరి...

ప్రజాశక్తి-కెవిబిపురం: కెవిబి పురం మండలంలోని రంగయ్యగుంట గ్రామంలో నివాసముంటున్న బత్తయ్య (47) బుధవారం విద్యుత్ షాక్ తగిలి మతి చెందాడు. ఆవు కనబడలేదని వెతుక్కుంటూ వెళుతుండగా విద్యుత్ వైర్ తెగిపడి ఉండటాన్ని గమనించకుండా వెళ్లడంతో విద్యుత్ షాక్ కొట్టి మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. భార్య అమ్ములు ఉన్నారు. పెళ్లై ఇరవై ఏళ్లయినా వీరికి పిల్లలు లేరు. కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్య అమ్ములుకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్

ప్రజాశక్తి-గూడూరు: మండల పరిధిలోని నెర్నూరు గ్రామ సమీపంలో ఈనెల 23వ తేదీ భార్య శ్రావణిని కత్తిలో దాడి చేసి మతికి కారణమైన ముద్దాయి భర్త నాగరాజును రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. భార్యను హత్య చేసిన భర్త నాగరాజును మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం డిఎస్పి మాట్లాడుతూ పట్టణంలోని వరదానగర్‌లో నాగరాజు, శ్రావణి వివాహం చేసుకొని 15 సంవత్సరాలు నుండి నివశిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తలు తోటల వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో శ్రావణి సన్నిహితంగా ఉంటూ ఇంటిలో పిల్లలను వదిలివేసి అతనితో తిరుగుతూ ఉండడంతో ఈనెల 23వ తేదీ భర్త నాగరాజు శ్రావణికి ఫోన్ చేసి మాట్లాడగా ఆమె దురుసుగా మాట్లాడిందని వెల్లడించారు. దీంతో కోపంతో భర్త నాగరాజు నేర్నూరు సమీపంలో ఉన్న తోట వద్ద శ్రావణి పై కత్తితో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయం అయింది. అనంతరం ఆమెను హాస్పిటల్‌కి తీసుకురాగా అప్పటికే మతి చెందింది. పరారీలో ఉన్న నాగరాజును మంగళవారం రాత్రి అరెస్టు చేశామని, కోర్టులో హాజరు పరుస్తున్నామని తెలిపారు. ముద్దాయిని ఛేదించిన కేసులో సిఐ,ఎస్ఐ, సిబ్బందిని ప్రత్యేకంగా డిఎస్పి అభినందించారు. సమావేశంలో రూరల్ సీఐ దశరథ రామారావు, ఎస్సై బ్రహ్మనాయుడు, రాజు, విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు .

పాము కాటుకు గురైన మహిళ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని పూలతోట గ్రామ పరిధిలో ఉన్న పంట పొలాలలో మిరప కోస్తుండగా సత్తివేటి లక్ష్మీ అను మహిళ బుధవారం పాముకాటుకు గురైంది. వివరాలు... పాము కాటుకు గురైన లక్ష్మి స్వగ్రామం నాయుడుపేట మండలం శ్రీనివాసపురం గిరిజన కాలనీకి చెందిన మహిళ. ఈమె గ్రామస్థులతో కలిసి పూల తోట గ్రామం దగ్గర మిరప తోటలో పనికి పోగా అక్కడ పాము కాటికి గురైంది. దీంతో ఆమెను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లగా వైద్యులు చైతన్య, పద్మావతి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్సకు 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామసభలతోనే భూముల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-గూడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న భూ రక్షా భూహక్కు పథకంతో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని గూడూరు రెవిన్యూ డివిజనల్ అధికారి మీసాల కిరణ్ బుధవారం తెలిపారు. సదా, బైనామా, చుక్కలు, అసైన్డ్ భూములలో ప్రస్తుతం సాగులో ఉన్న రైతులను గుర్తించేందుకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహించి అప్పట్లో క్రయ విక్రయాలతో పొందిన భూముల రైతులను పిలిపించి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు అగ్రిమెంట్ పాత్రలను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు భూ యజమాని హక్కులు. కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి స్మగ్లింగ్‌ను కట్టడి చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఎన్‌డిపిఎస్ కేసులపై జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి గంజాయి స్మగ్లర్లు సరికొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని, వారి మార్గాలను పసిగట్టి పోలీసులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎత్తుకుపైఎత్తు వేసి స్మగ్లర్లను ఎక్కడికక్కడ కట్టడి చేయాలన్నారు. ఎన్‌డిపిఎస్ కేసుల నమోదు, ముద్దాయి అరెస్టు, రిమాండు చేయడమే కాకుండా గంజాయి ఎక్కడ నుంచి సరఫరా అవుతోంది, ఎవరు వినియోగిస్తున్నారో దర్యాపు చేసి, వారందరికి కఠినశిక్ష పడేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఫిలు కులశేఖర్, విమలకుమారి, సెబ్ జాయింట్ డైరెక్టరు రాజేంద్ర, ఎస్‌బి డిఎస్‌పి సురేంద్రరెడ్డి, వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో అక్కినేని నాగార్జున దంపతులు

ప్రజాశక్తి- తిరుమల: అఖిల్ నటించిన ఏజెంట్, నాగచైతన్య నటించిన కస్టడీ చిత్రాలు విజయవంతం కావాలని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నట్లు అక్కినేని నాగార్జున దంపతులు వెల్లడించారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని వారు దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదాశీర్వాదం అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏడాది తర్వాత సతీ సమతేంగా శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.